క్లుప్తంగా

టైలర్లకు సత్కారం



ఉంగుటూరు చల్లాలమ్మ ఆలయం వద్ద టైలర్సు డేలో పాల్గొన్న దర్జీలు

పెదపాడు: టైలర్స్ దినోత్సవం సందర్భంగా మహిళా టైలర్లను మానవత ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులోని మానవత కార్యాలయంలో తంగెళ్లపల్లి వీరాచారి భార్య శ్యామలను పూలమాలలువేసి ఘనంగా సత్కరించారు. మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు, ఘంట సత్యన్నారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉంగుటూరులో ఉత్సాహంగా టైలర్సు డే

ఉంగుటూరు: ఉంగుటూరులో టైలర్సు డే నిర్వహించారు. శుక్రవారం కుట్టు మిషన్ సృష్టికర్త విలయమ్స్ హువే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ టైలర్ల సంఘం అధ్యక్షుడు సారిక చల్లారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ముప్పన సత్యనారాయణ తదితరలు పాల్గొన్నారు.

వైభవంగా గణాచారుల ఉయ్యాల సేవ



భీమడోలు జాతరలో ఉయ్యాల సేవలో గణాచారులు

భీమడోలు: భీమడోలులో గ్రామదేవతలుగా పూజలందుకుంటున్న మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజు జాతర మహోత్సవ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. 12 ఏళ్ల కొకసారి వచ్చే ఈ జాతర మహోత్సవంలో జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో గణాచారులకు ఉయ్యాల సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత పంబలివారు తంగిరాల చిట్టియ్య ఆధ్వర్యంలో సంబరాన్ని నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో మద్దిరామమ్మకు పెద్ద ఎత్తున మహిళలు చలిమిడి, పానకాలు సమర్పించి పూజలు చేసారు. గ్రామానికి విచ్చేసిన ఆర్మీ సైనికులు స్వచ్ఛందంగా ఏర్పాట్లలో భాగస్వామ్యులయ్యారు.

పేదలకు అందని కంటి వైద్యం

- కూటమి ప్రభుత్వంలో ప్రజా వైద్యంపై వివక్ష
- పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలు నిలుపుదల
- గతంలో విద్యార్థులకు, వృద్ధులకు సక్రమంగా అందిన వైద్య సేవలు



కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

దెందులూరు: కూటమి ప్రభుత్వం నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులు, వృద్ధులు కంటి వైద్య సేవలకు దూరమయ్యారు. అభం శుభం తెలియని విద్యార్థులు, వృద్ధులకు కూడా రాజకీయం ఆపాదించేలా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కంటి వైద్య సేవలు నిలుపుదల చేయడం సర్వత్రా చర్చకు దారితీసింది. ప్రభుత్వ నిర్ణయంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు, గ్రామాలు, పట్టణాల్లోని వృద్ధులకు నిరాటంకంగా కంటి వైద్య పరీక్షలు అందించాలని దెందులూరు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ, ప్రజా సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఉచితంగా శస్త్రచికిత్స, కళ్లజోళ్ల అందజేత

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సీహెచ్‌సీల్లో ప్రజలకు కంటి వైద్య పరీక్షలు చేయడంతో పాటు, శస్త్ర చికిత్సలు, ఉచిత కళ్లజోళ్లు లక్షల మందికి అందజేశారని నాయకులు గుర్తు చేస్తున్నారు. పేద విద్యార్థులందరూ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకునే పరిస్థితి నేడు లేదు. కంటి వైద్యం నేడు ఖరీదైనదిగా మారింది. రెక్కాడితే గాని డొక్కాడని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు వేలాది రూపాయలు ఖర్చు భరించి వైద్యశాలకు ఎలా వెళ్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలల్లోనూ గతంలో కంటి వైద్య పరీక్షలు చిన్నారులకు ఉచితంగా చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీహెచ్‌సీలో కంటి వైద్య పరీక్షలు, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిలుపుదల చేయటం వెనుక ఆంతర్యం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు. ఒక పక్క గ్రామాల్లో సర్వేలు చేస్తూ పెన్షన్లు తొలగిస్తున్నారని, మరో వైపు పేదలకు వైద్యాన్ని దూరం చేసే కార్యక్రమాలు ప్రభుత్వం తలపెడుతోందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉచిత వైద్య సేవలు నిలుపుదల చేస్తే ప్రజాగ్రహం తప్పదని పలువురు అంటున్నారు. విద్యార్థులకు సీహెచ్‌సీలో ప్రజలకు కంటి వైద్య సేవలు పరీక్షలు పునరుద్ధరించాలని ఏసుబాబు కోరారు.

దెందులూరు నియోజకవర్గం వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
దెందులూరు	62	5,470
పెదవేగి	93	10,000
పెదపాడు	53	4,523

వృద్ధులు, విద్యార్థులపై వివక్ష తగదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్ని విషయాల్లో రాజకీయ ప్రధాన అజెండాగా పాలన చేస్తున్నారు. వృద్ధులకు, విద్యార్థులకు పాఠశాలల్లో చేసే కంటి పరీక్షలు, వైద్యసేవల విషయంలోకూడా రాజకీయం చేయడం బాధాకరం. తీవ్ర అభ్యంతరకరం. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు పాఠశాలల్లో కంటి వైద్యపరీక్షలు, సేవలు అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎందుకు నిలుపుదల చేశారు.

– కట్టా ఏసుబాబు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యుడు

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేయాలి



వేలాది మంది పాఠశాల విద్యార్థులకు ఏదైనా కంటి సమస్యలు వస్తే ఇప్పుడు ఎలా? పాఠశాలల్లో వైద్య పరీక్షలు ఎందుకు నిలుపుదల చేశారు? పేద విద్యార్థులకు కంటి వైద్యం ఇక అందని ద్రాక్షేనా? కూటమి ప్రభుత్వం విద్యార్థులు, తల్లిదండ్రుల ఆగ్రహం త్వరలోనే చవిచూడక తప్పదు. వేలాది మంది విద్యార్థులు కంటి వైద్యానికి దూరమయ్యారు.

– బోరా మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు, దెందులూరు

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు



నారాయణపురం పరీక్షా కేంద్రంలో రోల్ నంబర్లు రాస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మార్చి 1 నుంచి 15వతేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కేంద్రంలో 334 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారని ప్రిన్సిపాల్ బి వి.శ్రీనివాస్ తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 222 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 112 మంది పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఆయన వివరించారు. శనివారం ప్రథమ సంవత్సరం పరీక్ష ప్రారంభం కాగా సోమవారం నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. పరీక్షా కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంటుగా పి.వెంకటేశ్వరరావు, డిపార్టుమెంటల్ ఆఫీసరుగా దేవ విజయలక్ష్మి వ్యవహరిస్తారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, విద్యార్థులకు అవసరమైన మంచినీరు, మెడికల్ సదుపాయం కేంద్రం వద్ద కల్పించామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

భారీ వృక్షాలను నరికి అక్రమంగా కలప తరలింపు



యర్రమిల్లిపాడు పాఠశాల వద్ద వృక్షాలను నరికి కలపను తరలిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: యర్రమిల్లిపాడు పాఠశాల వద్ద ఎన్నో ఏళ్లుగా పెరిగిన వృక్షాలను తెగనరికి కలపను అక్రమంగా తరలించడంపై శుక్రవారం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలప తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనిపై రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సర్పంచి తమ్మిన శ్రీనివాసరావును వివరణ అడగ్గా కలప తరలింపు విషయం తనకు తెలియదని తెలిపారు. గ్రామ పెద్దలు, అధికారుల అండదండలతో కొందరు ప్రభుత్వ స్థలాల్లోని చెట్లను నరికి కలప తరలిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఏలూరు కాలువ గట్టునున్న ఏళ్లనాటి చెట్లను ఇదే రీతిలో నరికి కలప పట్టుకుపోయినా అధికారులు పట్టించుకోలేదు.

ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలి



పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెదవేగి : ఆయిల్ పామ్ గెలలు గ్రేడింగ్‌పై రైతులు ఆందోళన చేసిన ఫలితంగా ఆయిల్ ఫెడ్ కర్మాగారంలో అధికారులు రైతులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులతో చర్చలు జరిపారు. ఆయిల్ పామ్ గెలల గ్రేడింగ్ సమస్య పరిష్కరిస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం పరిధి ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, రైతులు మన్నే బాబూరావు, బొల్లు రామకృష్ణ మాట్లాడుతూ రైతుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ ఆపాలని, కొత్త కర్మాగారం నిర్మించాలని కోరారు. ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ గ్రేడింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆయిల్ పామ్ రైతులు, ఆయిల్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు

రైల్వే గేటు వేసి ఉంటే ట్రాక్ దాటవద్దు

ఉంగుటూరు: గేటు వేసి ఉంటే గేటు క్రింద నుంచి దూరి రావడం ప్రమాదం పొంచి ఉన్నట్లు అని తాడేపల్లిగూడెం ఏఎస్సై శ్రీనివాస్ ద్విచక్రవాహనాదారులకు శుక్రవారం ఉంగుటూరు రైల్వే గేటు వద్ద అవగాహన కల్పించారు. గేటు వేసి ఉంటే గేటు క్రింద నుంచి వెళ్లవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, గేటు మేన్ తీడ వెంకటరావు పాల్గొన్నారు.

సైన్స్ ప్రాధాన్యతను అందరూ గుర్తించాలి



గణపవరం: విద్యార్థుల సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో, సర్పంచ్



భీమడోలు: మానస స్కూల్లో ఆకట్టుకున్న సైన్సు ప్రాజెక్టుల ప్రదర్శన

దెందులూరు: సైన్స్ డే ప్రాధాన్యతను విద్యార్థులు తల్లిదండ్రులు గుర్తించాలని అవగాహన పెంపొందించాలని శ్రీ సాయి హైస్కూల్ డైరెక్టర్ బోయపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గంగన్నగూడెం సాయి హైస్కూల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బోయపాటి సాయి బాబా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు సంయుక్తంగా సైన్స్ డే నిర్వహించారు. వివిధ రకాల అంశాలు ప్రాధాన్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు.

పాఠశాలల్లో ఘనంగా సైన్స్ దినోత్సవం

గణపవరం: భారతరత్న సీవీ రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఘనంగా నిర్వహించారు. జల్లికొమ్మర స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో గొర్రెల బాలయ్య హాజరై నిత్యజీవితంలో సైన్స్ అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి విద్యార్థులతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు అందించారు. సర్పంచ్ కురెళ్ల వెంకట రత్నం, ఎంపీటీసీ బుద్దాల వెంకటేశ్వరరావు, గ్రామ పెద్ద కవల కోదండరాం బాబు ఉన్నారు.

మణికంఠకు క్విజ్ పోటీల్లో జిల్లా ఫస్ట్

దెందులూరు: విద్యార్థుల్లో పోటీతత్వం, పరిశీలన, నిరంతర సాధన ఉండాలని వృక్ష శాస్త్రవేత్త పద్మశ్రీ నాగేశ్వరరావు అన్నారు.జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థి పి మణికంఠ జిల్లా ప్రథమ బహుమతి సాధించారు. శుక్రవారం ఏలూరు ఈదర సుబ్బమ్మ దేవి స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో రూ.3 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని మణికంఠకు నాగేశ్వరరావు తదితరులు అందజేశారు. గైడ్ టీచర్ కళ్యాణిని అతిథులు అభినందించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్ , డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ సోమయాజులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పెదపాడు: సైన్స్ దినోత్సవం సందర్భంగా మానవత అప్పనవీడు శాఖా కార్యాలయంలో గ్రీన్ ఎనర్జీ గ్రీన్ హైడ్రోజన్ అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. మానవత ప్రతినిధులు మారుబోయిన కోటేశ్వరరావు, ఘంటా సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యం, జ్ఞానంతో కూడిన విద్య అవసరం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెగ్గుకురావాలంటే నైపుణ్యం, జ్ఞానంతో కూడిన విద్య అవసరం ఎంతైనా ఉందని ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. విద్యా కమిటీ చైర్మన్ వడ్డాది సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: కైకరం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జాతీయ సైన్స్ వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ హాజరై విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు సైన్స్‌కు సంబంధించి ఉపన్యాసాలు, పాటలు, నృత్యాలు ప్రదర్శించారు. ఉత్తమ సైన్స్ మోడల్స్‌ను గుర్తించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గుళ్ల ప్రసాద్‌రావు, సీహెచ్ శ్రీనివాస కుమార్, కె.జాన్, ఎన్.బేబీరాణి, బి.సీతారాములు, జి.పోసియ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీవీ రామన్ సేవలు అజరామరం

భీమడోలు: నోబెల్ అవార్డు గ్రహీత, భారతరత్న చంద్రశేఖర వెంకటరామన్ చేసిన సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు అన్నారు. జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో నిర్వహించిన సైన్సు ప్రాజెక్టులు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం పి.నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్ సైన్స్ డే ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ క్విజ్ నిర్వహించారు. భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సైన్సు టీచర్లు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ సోషల్ ఆడిట్ డీఆర్పీ వెంకటరాజు

పెదపాడు : ఒత్తిడి లేని విద్యతోనే ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ సోషల్ ఆడిట్ డీఆర్పీ కె వెంకటరాజు అన్నారు. పెదపాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డీఆర్పీ వెంకటరాజు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులతో ఆయన చర్చించారు.స్టాక్‌రూమ్‌లో బియ్యం గుడ్లు, చిక్కీ, వంట నూనె, దినుసుల నిల్వలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసారు. వెంకటరాజు వెంట పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు వడ్డాది నాగసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు పీ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

వ్యాధులపై ఇంటింటా సర్వే



ఇంటింటా సర్వే చేసి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: వ్యాధులపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని గోపన్నపాలెం సీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా అన్నారు. శుక్రవారం గ్రామాల్లో వైద్య సిబ్బంది చేస్తున్న సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వేను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.అనారోగ్య సమస్యలను సర్వే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

సౌత్ జోన్ పోటీలకు తమిళనాడు పయనం

దెందులూరు: సౌత్ జోన్ బాలికల హ్యాండ్ బాల్ జట్టు (జేఎన్‌టీయూ కాకినాడ) తమిళనాడు రాష్ట్రం సేలం పెరియార్ యూనివర్సిటీలో పోటీలో పాల్గొనేందుకు శుక్రవారం వేగవరం నుంచి బయలుదేరి వెళ్లారు. వేగవరం హేలాపురి టెక్నాలజీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, ఏవో కరుణానిధి బాలికల జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ఏవో కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

జంగారెడ్డిగూడెం: కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో కాటికాపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ శ్మశానంలో వృత్తి చేస్తున్న వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వయో వృద్ధులైన కార్మికులకు రూ.8 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. కాగా, కాటికార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 3వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.ప్రభాకర్ రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహించాలి



భీమడోలులో సీసీ కెమెరా ఏర్పాటుపై సూచనలందిస్తున్న సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: భీమడోలు జాతర మహోత్సవంలో శాంతిభద్రతలకు విఘాత కలుగకుండా కమిటీ నిర్వాహకులు పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. భీమడోలు అమ్మవార్ల ప్రాంగణంలో శుక్రవారం ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి సీఐ యూజే విల్సన్ జాతర కమిటీ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈనెల 8, 9వ తేదీల్లో జాతర కీలక ఘట్టాల నేపథ్యంలో గ్రామంలో ఊరేగింపునకు భీమడోలు గ్రామానికి లక్షలాది మంది భక్తులు వచ్చే రానున్నందున ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా, ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కమిటీ పెద్దలు పోలీసులు సహకరించాలని కోరారు. అవాంఛనీయ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ పెద్దలు, యువకులు, సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

ఏలూరు(మెట్రో): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా, నీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పింఛన్లు, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎంఈ సర్వే, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు, ఫీడర్ స్థాయి సోలారైజేషన్ పథకానికి భూమి కేటాయింపు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఏలూరు నగరంలో తాగునీటి సరఫరాపై కమిషనర్‌ను ఆరా తీశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, సీపీఓ సీహెచ్ వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జి, డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్ రాజు, పౌర సరఫరాల శాఖ జీఎం శ్రీలక్ష్మి, ఏపీఎస్ ఆర్టీసీ డీయం బి.వాణి, నగర కమిషనర్ ఎ.భానుప్రతాప్, డీఎల్‌పీఓ సుందరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పట్టాభిషేక మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ దంపతులు స్వామివారి పట్టాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో నిత్య కల్యాణం నిర్వహించారు.